క్లుప్తంగా

ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారం



తనుశ్రీ, ఆమె తల్లిదండ్రులను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్

సామర్లకోట: స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని బి.తనుశ్రీ గురువారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్టు పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. పదో తరగతి ఫలితాలల్లో తనుశ్రీ 585 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంతో పాటు జిల్లాస్థాయిలో 10వ స్థానం దక్కించుకుంది. ఈ మేరకు కలెక్టరేట్‌లో తనుశ్రీకి రూ.10 వేల నగదుతో పాటు విలువైన పుస్తకాలను బహుమతిగా అందజేశారని తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులు లక్ష్మీప్రభ, పాండురంగారావులను జిల్లా కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి. రమేష్, డీవైఈఓ నాయుడు వెంకటేశ్వరరావు, ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

పిఠాపురం రూరల్ ఎస్సైగా జాన్ బాషా



పిఠాపురం: పిఠాపురం రూరల్ ఎస్సైగా ఎస్‌కే జాన్ బాషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకూ పిఠాపురం పట్టణ అదనపు ఎస్సైగా బాధ్యతలు నిర్వహించారు. ఆయనను రూరల్ ఎస్సైగా నియమిస్తూ జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు. పిఠాపురం మండల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



వేసవి శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న నాగరాజు

పెద్దాపురం: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం కలుగుతుందని, గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు సూచించారు. పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం పుస్తక పఠనం, కథలు చదవడం నేర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు జి.వెంకట్రావు, పి.లచ్చబాబు విద్యార్థులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభం



సామర్లకోట బసివిరెడ్డి సత్రం వద్ద మజ్జిగ చలివేంద్రం

సామర్లకోట: ప్రస్తుత వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు పట్టణంలో గురువారం మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక పెద్దాపురం రోడ్డులోని విఘ్నేశ్వర థియేటర్ ఎదురుగా పాల కేంద్రం వద్ద మాజీ మున్సిపల్ విద్యాకమిటీ చైర్మన్ నక్కా జానికి రామయ్య మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో బసివిరెడ్డి సత్రం వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుస్తుల వ్యాపారి గ్రంధి సత్యనారాయణమూర్తి మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో ఒకటో నంబర్ ప్లాట్ ఫాంపై స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో కూలింగ్ వాటర్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడిగా సూర్యనారాయణ



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న వర్మ

పిఠాపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం గొల్లప్రోలు మండల అధ్యక్షుడిగా కేదారిశెట్టి సూర్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. గొల్లప్రోలు ఆర్య వైశ్య సంఘ కల్యాణ మండపంలో గురువారం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్‌ఎన్ వర్మ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. పలువురు ఆర్య వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో టెన్షన్

- ప్రమాదాలకు నిలయంగా ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి
- వాహనాలు ఢీ కొనడంతో బ్రిడ్జిపై కూలిన రెయిలింగ్
- ఆదమరిస్తే అంతే సంగతులు

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి ప్రదేశం ప్రమాదాలకు నిలయంగా మారింది. సుమారు రెండేళ్ల క్రితం రాజమహేంద్రవరం నుంచి ఏడీబీ రోడ్డులో సామర్లకోట ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా వచ్చే వాహనాలు అదుపు తప్పి బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొన్నాయి. ప్రస్తుతం బ్రిడ్జిపై భారీ వాహనాలతో పాటు చిన్న వాహనాల చోదకులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పెనుప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీనికి తోడు ప్రతిరోజూ వందలాది మంది కాలి నడకన ఫుట్‌పాత్ మీదుగా నడిచి వెళతారు. కొంత మంది రెయిలింగ్‌ను పట్టుకొని నడుచుకుంటూ వెళతారు. ఇటువంటి సమయంలో కూలిన రెయిలింగ్‌ను గమనించకపోతే సుమారు 20 అడుగుల ఎత్తు నుంచి కింద పడే అవకాశాలున్నాయి. ఆర్ అండ్ బీ అధికారులు ఇటీవల ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న గోతులు పూడ్చిన సమయంలో కూలిన రెయిలింగ్‌ను ఏర్పాటు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్ అండ్ బీ అధికారులు కూలిన రెయిలింగ్ వద్ద రిబ్బన్లు కట్టి చేతులు దులుపుకున్నారు. ఆ రిబ్బన్లను ఆకతాయిలు తొలగించారు. అలాగే స్థానిక సత్యనారాయణపురం రోడ్డులో రెయిలింగ్ కూలి ఏడాది కావస్తుంది. అక్కడ కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు రిబ్బన్లు ఏర్పాటు చేశారనే విమర్శలు ఉన్నాయి.

అతి వేగం కారణంగానే..

ఏడీబీ రోడ్డులో రాజమహేంద్రవరం నుంచి వచ్చే వాహనాలు అతివేగంగా రావడం వలనే తరచూ ముఖ్య కూడలి ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం నుంచి వాహనాలు సామర్లకోట–కాకినాడ వెళుతుంటాయి. ముఖ్య కూడలి ప్రదేశంలో మలుపు ఉండటంతో అతివేగానికి వాహనం అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీకొంటున్నాయి. కొన్ని సమయాల్లో రెయిలింగ్‌ను ఢీకొని వాహనాలు కింద పడి కొంత మంది మృతికి కారణమవుతున్నాయి. ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి ప్రదేశంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి దానిపై రేడియం స్టికర్లు వేస్తే కొంత వరకూ వాహనాల వేగాన్ని అదుపు చేయవచ్చు.

బ్రిడ్జి గోడల్లో పెరిగిపోతున్న మొక్కలు

ఫ్లైఓవర్ గోడల్లో మొక్కలు పెరిగిపోతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మొక్కే కదా అని వదిలేయడంతో అవి చెట్లుగా పెరిగిపోతున్నాయి. చెట్లు పెరిగి పోవడంతో బ్రిడ్జి గోడలు బీటలు వేసి బ్రిడ్జికి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. బ్రిడ్జి గోడలో పెరిగిపోతున్న మొక్కలను తొలగించడానికి నిధులతో పని లేకపోయినా వాటిని తొలగించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థంకావడం లేదు.



ఏడీబీ రోడ్డు నుంచి సామర్లకోట మార్గంలో కూడలి వద్ద కూలిన రెయిలింగ్



సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి వద్ద రైల్వే క్వార్టర్స్ వైపు కూలిన రెయిలింగ్



సామర్లకోట స్టేషన్ సెంటర్‌కు వచ్చే మార్గంలో ఇలా..

ప్రమాదాలను నివారించాలి



ఇటీవల రాజమహేంద్రవరం నుంచి మోటారు సైకిల్‌పై వస్తున్న భార్యాభర్తలు, కుమారుడు అదుపు తప్పి ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి రైల్వే క్వార్టర్స్ వైపు డ్రైన్‌లో పడిపోయారు. స్వల్ప గాయాలతో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. సామర్లకోట బ్రిడ్జి నిత్యం రద్దీగా ఉంటుంది. భారీ వాహనాల రాకపోకల సమయంలో కూలిపోయిన రెయిలింగ్ వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు వెంటనే రెయిలింగ్ నిర్మాణం పూర్తి చేసి ప్రమాదాలు నివారించాలి.

మోరంపూడి మంగ, చిరు వ్యాపారి, సామర్లకోట

కూలిన రెయిలింగ్‌ను గుర్తించాం



స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై కూలిన రెయిలింగ్‌ను గుర్తించాం. ఇటీవల ఎమ్మెల్యే రాజప్ప రెయిలింగ్ విషయాన్ని మా దృష్టికి తీసుకువచ్చారు. రెయిలింగ్ కూలిన ప్రదేశంలో పోలీసులు బైండింగ్ తీగ ఏర్పాటు చేశారు. నిధులు కొరత కారణంగా రెయిలింగ్ నిర్మాణం చేయలేని పరిస్థితి నెలకొంది. నిధులు వచ్చిన వెంటనే కూలిన రెయిలింగ్‌ను నిర్మాణం చేస్తాం. బ్రిడ్జి గోడలో మొక్కలు తొలగిస్తాం.

నరసింగరావు, ఆర్‌అండ్‌బీ డీఈ కాకినాడ

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన



సామర్లకోటలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న పాస్టర్లు

సామర్లకోట: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడికి నిరసనగా గురువారం రాత్రి మండల పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుంచి బ్రౌన్‌పేట సెంటర్ వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఉగ్రవాదులు, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పాస్టర్ల సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు టి. బ్లెసింగ్, జి.జయబాబు, మున్సిపల్ క్రిస్టియన్ మైనార్టీ కో ఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్, పాస్టర్ల సంఘ నాయకులు కొండేపూడి రవిబాబు, వై.కరుణకుమార్ ఎ.జేమ్స్, ఎ.చంటి, వి.జాన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన నేతలు



మాజీ సీఎం జగన్‌తో దొరబాబు

పిఠాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు గురువారం తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలుసుకున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌ను కలసి పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి, వైస్ చైర్ పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, పార్టీ పట్టణ అధ్యక్షుడు రావుల మాధవరావు, నాయకులు గండేపల్లి బాబీ, తలిశెట్టి వెంకటేశ్వరరావు, పెదపాటి రాజేష్, వబ్రపు వీరేష్, బోను దేవ, పెదపాటి నాగేశ్వరరావు, లలిత, బత్తిన రాజశేఖర్, ఉలవల భూషణం, పచ్చిమళ్ల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన దొరబాబు

సామర్లకోట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ పెద్దాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు గురువారం కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గంలో పరిస్థితిని వివరించారు.



తాడేపల్లిలో జగన్ కలసిన అనంతరం వంగా గీత, పిఠాపురం మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు

కిశోరి వికాసంపై నేటి నుంచి శిక్షణ



శిక్షణ పొందుతున్న వారికి పుస్తకాలు అందజేస్తున్న ఎంపీడీఓ స్వప్న

పిఠాపురం: కిశోరి వికాసంపై శుక్రవారం నుంచి జూన్ 10వ తేదీ వరకూ వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ జిల్లా కౌన్సిలర్ బి.దుర్గా రాణి తెలిపారు. గొల్లప్రోలు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కిశోరి వికాసంపై ఎంపీడీవో కె.స్వప్న ఆధ్వర్యంలో మండల పరిధిలో మహిళా సమాఖ్య ప్రతినిధులు, ఏఎన్‌ఎంలు, వీఓఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ ఫెసిలిటేటర్ ఏవిధంగా కిశోరి బాలికలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలి, కిశోరి వికాసాన్ని ఏవిధంగా సాధించాలి , కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలా డెవలప్ చేయాలి అనే అంశాలను వివరించారు. బాలల హక్కులు, చట్టాలు కౌమార బాలబాలికల సమస్యలు, పిల్లల సంరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల నిర్మూలన, పోక్సో చట్టం, కౌమార దశలో వచ్చే మార్పులు, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. పిల్లలతో డ్రామాలు, రోల్ ప్లే లాంటివి చేయించడం ద్వారా పిల్లల్లో ఉన్న నైపుణ్యాలను డెవలప్ చేయడం, వాళ్లను ఎడ్యుకేట్ చేయడం అనే అంశాల మీద ఆరు పుస్తకాలతో కూడిన కిట్లను ఎంపీడీఓ చేతుల మీదుగా మహిళా సమాఖ్య ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మానస దేవి పాల్గొన్నారు.

అధ్యాపకుడు రమేష్‌కు అవార్డు



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న రమేష్

పెద్దాపురం: మండలంలోని దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు పీవీ రమేష్‌కు అకడమిక్ అడ్వైజర్ అవార్డు లభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి, హై కమిషన్ కౌన్సిలర్ నితీష్‌కుమార్ చేతుల మీదుగా రమేష్ అకడమిక్ అడ్వైజర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నారన్నారు. అవార్డు పొందిన రమేష్‌ను కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్స్ సర్వరామేశ్వరుడు, ఈఓ జెన్నిబాబు, ఏఓ పెద్దకాపు తదితరులు అభినందించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: స్థానిక 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎవీఎస్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధి లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మండల పరిధిలో..

సామర్లకోట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్ గురువారం తెలిపారు. మాధవపట్నం 11కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మాధవపట్నం, పి.వేమవరం, ఉండూరు, కాపవరం, గొంచాల, బ్రహ్మానందపురం, చంద్రం పాలెం, నవర, వీకే రాయపురం, బోయనపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పిఠాపురం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్ గురువారం తెలిపారు. ప్రస్తుతం వర్షాలు, ఈదురుగాలులు వీస్తుండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా చెట్టు కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా కుమారపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కుమారపురం ఫీడర్, ఎల్ఎన్ పురం ఫీడర్, కుమారపురం, విరవాడ, ఎల్ఎన్ పురం, కొత్తపల్లి మండలం ఆనంద నగర్, నాగంపేట తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అరుణపతాకం రెపరెపలు

- ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం
- గ్రామాలు, పట్టణాల్లో కార్మికుల ర్యాలీలు

పిఠాపురం: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని గురువారం పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని మేడే జెండాలను ఆవిష్కరించారు. పిఠాపురంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆర్టీసీ కాంప్లెక్స్, మార్కెట్ సెంటర్, కోటగుమ్మం మెయిన్ రోడ్డు మీదుగా ఉప్పాడ బస్టాండ్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఉప్పాడ బస్టాండ్, రిక్షా కార్మిక సంఘం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్ చట్టాన్ని కార్మికులందరూ వ్యతిరేకించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు పరం చేస్తోందన్నారు. భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను మార్పు చేయడాన్ని కార్మికులందరూ వ్యతిరేకించాలన్నారు. కార్మికులకు 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటలకు పని గంటల విధానాన్ని అమలు చేయడానికి వ్యతిరేకంగా ఈ నెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సీఐటీయూ పిలుపును ఇచ్చిందన్నారు. ఈ సమ్మెను కార్మికులందరూ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు కె.చిన్న, కె.విశ్వనాథం, రజక వృత్తిదారుల సంఘ జిల్లా నాయకులు కోనేటి రాజు, కె.నాగేశ్వరరావు, భవన నిర్మాణ సంఘ నాయకులు సత్యనారాయణ, పి. వీరబాబు, కార్పెంటర్ సంఘం నాయకులు చిరంజీవి ఎ.వీరబాబు, ఎలక్ట్రికల్ సంఘం నాయకులు రామన్న రాజు, సత్య శ్రీనివాస్, పెయింటర్స్ సంఘం నూతాటి కృష్ణ, అప్పన్న బాబు, రిక్షా కార్మిక సంఘం నాయకులు సత్యనారాయణ, సత్తిబాబు, మున్సిపల్ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, పి.అప్పారావు పాల్గొన్నారు.

సామర్లకోట: మే డేను పురస్కరించుకొని వివిధ కార్మిక సంఘాల నాయకులు ఆదివారం ర్యాలీలు నిర్వహించారు. స్థానిక ఐఎంఎఫ్‌ఎల్ డిపో వద్ద కార్మిక సంఘ నాయకులు మేడే జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా హమాలీస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు మేడే ప్రాధాన్యతను వివరించారు. కార్మికులకు మిఠాయిలు పంచారు. స్థానిక ఐఎంఎఫ్‌ఎల్ డిపో యూనియన్ అధ్యక్షుడు విశ్వనాధుల అప్పలరాజు, ఉపాధ్యక్షుడు బుర్రె ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి అమలకంటి సోమేశ్వరరావు, సహాయ కార్యదర్శి బైరెడ్డి సూర్యసత్యనారాయణ, కోశాధికారి నక్కా నాగేశ్వరరావు పాల్గొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. సీపీఎం, సీఐటీయూ, సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని ముఖ్య కూడలి ప్రదేశాల్లో సెంటర్ వద్ద జెండాలు ఎగురువేశారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పాత తహసీల్దార్ కార్యాలయం నుంచి మెహర్ కాంప్లెక్స్, మఠంసెంటర్, స్టేషన్ సెంటర్, నీలమ్మ చెరువు మీదుగా ఏలేరు కాలువ వద్ద ఉన్న కమ్యూనిస్టు పార్టీ అమరవీరుల స్తూపం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పెదిరెడ్ల సత్యనారాయణ, మడగల రమణ, పెదిరెడ్ల అర్జున్, బి. శ్రీను, కామిరెడ్డి బొడకొండలు నాయకత్వం వహించారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

స్థానిక మెహర్ కాంప్లెక్స్ నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మెహర్ కాంప్లెక్స్ నుంచి మఠం సెంటర్, నీలమ్మచెరువు మీదుగా బళ్ల మార్కెట్ సెంటర్‌కు ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, మండల అధ్యక్షుడు బాలం శ్రీనివాసు ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడ నుంచి పిఠాపురం రోడ్డులోని కార్మిక పోరాటాల మృతవీరుల స్థూపం వద్దకు చేరుకొని మృతవీరులకు నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కరణం ప్రసాదరావు, సీఐటీయూ నాయకులు బాలం హరిబాబు, కరణం ఏడుకొండలు, చల్లా మహేష్,యువరాజు, దారబాని కృష్ణ, నాళం సత్యనారాయణ, అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి వి.ఎస్తేరురాణి, కోశాధికారి టి.నాగమణి, ఎస్‌కే పాతిమా పాల్గొన్నారు.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలులో యూటీఎఫ్ సీనియర్ నాయకులు దాడి పద్మనాభం పతాకావిష్కరణ చేశారు. కార్మిక దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎంవీ సత్యనారాయణ, పాపారావు, ఈపు గోవిందరాజులు, పీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్మిక దినోత్సవం

కొత్తపల్లి: మండలపరిధిలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో, ఊర చెరువు సెంటర్‌లో కార్మిక జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఉప్పాడ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఎం నాయకురాలు కె.బేబీరాణి మాట్లాడుతూ ఐక్యంగా ఉంటేనే కార్మిక సంఘలు బలోపేతం అవుతాయన్నారు. పోరాటాలు, ఐక్యతతోనే కార్మిక హక్కులను సాధించగలమని తెలిపారు. ఉద్యోగులకు కనీస వేతనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.నాగేశ్వరరావు, గుర్రాల అప్పారెడ్డి, సాంబశివకుమార్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఊరచెరువు సెంటర్‌లో ఏఐసీటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఐప్వా జిల్లా అధ్యక్షురాలు శీలం అప్పలరాజు, కాశి ఎసురత్నంలు జెండాను ఎగుర వేశారు. ఏఐసీసీటీయు నాయకులు గొడుగు సత్యనారాయణ, యండలపల్లి ఎంపీటీసీ బర్రె రవి, కొల్లా వేణుగోపాల్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కదిలిన కార్మిక లోకం

పెద్దాపురం: కార్మిక దినోత్సవాన్ని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కార్మికులు ఎర్ర జెండాలు చేతబూని ర్యాలీలు నిర్వహించారు. కూడలి ప్రాంతాల్లో కార్మిక పతాకావిష్కరణలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై మండిపడుతూ నినాదాలు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో పులిమేరు, ఆనూరు గ్రామాల్లో మే డే వేడుకలు నిర్వహించారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి బి.రమేష్ పతాకావిష్కరణ చేసి కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. కార్పొరేట్ సంస్థలు కార్మికులను గుర్తించకుండా ప్రభుత్వాలు అవలంభిస్తున్న తీరుపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కుంచే అంజిబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, స్త్రీ విముక్తి జిల్లా కన్వీనర్ సంగీత, మునిలిబాబు, దేశెట్టి సురేష్ , గుడాల భూషణం, ఏసు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో...

సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనం వద్ద చింతల సత్యనారాయణ, సినిమా సెంటర్‌లో వడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో పతాకావిష్కరణలు నిర్వహించారు. మండలంలోని ఆనూరు, కొండపల్లి, సీబీదేవం, పులిమేరు, దివిలి, కట్టమూరు, కాండ్రకోట, చదలాడ, తిరుపతి, బి.తాటిపర్తి గ్రామాల్లో మేడే జెండాలను కార్మిక సంఘాల నాయకులు ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, మాగాపు నాగు, దాడి బేబీ, డి.క్రాంతికుమార్, కూనిరెడ్డి అరుణ, వై.అనంత లక్ష్మి, చల్లా విశ్వనాథం పాల్గొన్నారు.



పులిమేరులో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రైతుకూలీలు



పిఠాపురంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మిక సంఘం నాయకులు



సామర్లకోటలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ



పెద్దాపురంలో కార్మికుల ర్యాలీ



కొత్తపల్లిలో జెండాను ఎగురవేస్తున్న నేతలు



గొల్లప్రోలులో జెండా ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు